సాక్షి బాపట్ల

ఆదివారం । 29 । సెప్టెంబర్ । 2024



జాషువా గృహ సందర్శన

వినుకొండ(నూజెండ్ల): కవి కోకిల గుర్రం జాషువా స్వగ్రామం చాట్రగడ్డపాడులోని ఆయన గృహాన్ని ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం నాయకులు శనివారం సందర్శించారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 24890 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 16000 క్యూసెక్కులు వదులుతున్నారు.

ఆలయంలో పూజలు



మంగళగిరి: మంగళగిరిలోని లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

బాబుకు బుద్ధి చెప్ప స్వామీ!

ఆలయాల్లో పూజలు నిర్వహించిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

- తిరుమల ప్రతిష్టను మంటగలుపుతున్న కూటమి నేతలు
- శ్రీవారి లడ్డూ విశిష్టతను మసకబార్చారు
- రాజకీయ దురుద్దేశంతోనే తప్పుడు ప్రచారం
- తిరుమల వ్యవహారంపై సీబీఐ చేత విచారణ జరపాలని డిమాండ్

కలియుగ దైవం తిరుమల శ్రీనివాసుడి రూపం భక్తుల మదిలో అపురూపం. ఆయన నామ స్మరణ మోక్షదాయకం. తిరుమలేశుడి లడ్డూ ప్రసాదం అమృతతుల్యం. నోటిలో వేసుకోగానే పవిత్ర భావన. అటువంటి స్వామి ప్రసాదానికి బాబు రాజకీయ రంగు పులిమారు. కల్తీ నెయ్యి పేరిట క్షుద్ర రాజకీయాలకు పాల్పడుతున్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో జరగని అపచారాన్ని జరిగినట్లు మతిభ్రమించి మాట్లాడుతున్నారు. స్వామిపై అచంచల విశ్వాసంతో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కొండకు పాదయాత్ర చేపడితే అడ్డుకున్నారు. అబద్ధపు ఆరోపణలతో స్వామికి మహాపచారం చేసిన చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ జిల్లావ్యాప్తంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు శనివారం ఆలయాల్లో పూజలు చేశాయి. ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు కూటమి పార్టీలు రాజకీయ దురుద్దేశంతో తప్పుడు ప్రచారం చేస్తూ తిరుమల శ్రీవారి ప్రతిష్టను మంటగలుపుతున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికల్లో కుప్పలు తెప్పలుగా హామీలు ఇచ్చిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక వాటిని నెరవేర్చకపోవడంతో ప్రజలనుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటున్నారు. దాన్నుంచి బయట పడేందుకు చంద్రబాబు అండ్ కో లడ్డూ కల్తీ అయిందంటూ తప్పుడు ప్రచారానికి దిగారని వైఎస్సార్ సీపీ నేతలు ధ్వజమెత్తారు. – సాక్షి ప్రతినిధి, బాపట్ల



రేపల్లె

రేపల్లె నియోజకవర్గం చెరుకుపల్లి మండలం గుళ్లపల్లి శివాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త ఈపూరి గణేష్ ప్రత్యేక పూజలు చేశారు. రాజకీయ దురుద్దేశంతోనే చంద్రబాబు తిరుమలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు ఆరోపణలపై సిట్‌తో కాకుండా సీబీఐతో విచారణ జరిపించాలని కోరారు.

అద్దంకి



అద్దంకిలోని శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త హనిమిరెడ్డి పూజలు నిర్వహించారు. చంద్రబాబు తప్పుడు ప్రచారం మానుకోవాలని, ఆయనకు భగవంతుడు మంచి బుద్ధిని ప్రసాదించాలని దేవుడిని ప్రార్థించారు.

బాపట్ల



బాపట్లలో పార్టీ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు పాత బస్టాండ్ వద్ద వెంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి, ప్రసాదాలు పంచిపెట్టారు. పిట్టలవానిపాలెం మండలంలో రవిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పూజలు నిర్వహించారు.

వేమూరు



వేమూరు నియోజకవర్గంలో చుండూరు మండలం వలివేరు వేణుగోపాలస్వామి, భట్టిప్రోలు మండలంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు స్థానిక ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పర్చూరు



పర్చూరు మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో పార్టీ నేతలు పూజలు నిర్వహించారు. చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని ప్రార్థించారు.

చీరాల



చీరాల పాత బస్టాండ్ వద్ద ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబుకు బుద్ధి ప్రసాదించాలని దేవుడిని ప్రార్థించారు.

న్యూస్‌రీల్

ప్రత్యేక పరిష్కార వేదికలో 21 అర్జీలు స్వీకరణ



నరసరావుపేట: స్థానిక కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీల కోసం శనివారం నిర్వహించిన ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 21 అర్జీలను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు స్వీకరించారు. కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వెనుకబడిన వర్గాలు సమస్యలను తెలియజేశాయి. తక్షణమే స్పందించిన కలెక్టర్ సంబంధిత శాఖలకు ఆయా ఫిర్యాదులను అందజేసి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరంజిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వెనుకబడిన వర్గాలు వారి సమస్యలకోసం పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఈ అవకాశాన్ని ఆయా వర్గాల వారు ఉపయోగించుకోవాలని కోరారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, అధికారులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయానికి 15100 నంబర్ ఏర్పాటు



నరసరావుపేట టౌన్: ఉచిత న్యాయసేవల కోసం జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఉచిత న్యాయ సహాయ అధికారిక నంబర్ 15100ను వినియోగించుకోవాలని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.సత్యశ్రీ పిలుపునిచ్చారు. శనివారం అదనపు జిల్లా కోర్టు చాంబర్‌లో ఉచిత న్యాయ సహాయంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు అధికారిక నంబర్‌ను అన్ని ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా విస్తృత ప్రచారం కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. రైల్వేస్టేషన్, బస్టాండ్, కోర్టు ఆవరణ, ప్రభుత్వ కార్యాలయాలు, పోస్టాఫీస్, పాఠశాలలు, విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో ప్రజల సౌకర్యార్థం బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు ఆమె తెలిపారు. ప్రజలంతా నంబర్‌ను సద్వినియోగం చేసుకొని ఉచిత సేవలను పొందాలని ఆమె కోరారు.

భారీ వర్షంతో వాహన చోదకులకు అవస్థలు

తాడికొండ: తాడికొండ మండలం బండారుపల్లి ఆర్‌యూబీలో భారీ వర్షం కారణంగా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి వరద నీరు ఆర్‌యూబీలోకి చేరి బయటకు కదిలే పరిస్థితి లేకపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. సంబంధిత రైల్వే అధికారులు స్పందించి నీటిని వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

నేటి నుంచి పవిత్రోత్సవాలు



పెదకాకాని: స్థానిక శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం నుంచి మూడు రోజులపాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు డెప్యూటీ కమిషనర్ జీవీడీఎన్ లీలాకుమార్ తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాహుకేతు పూజలు సహా అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. అక్టోబరు 2వ తేదీ అమావాస్యను పురస్కరించుకుని అన్ని పూజా కార్యక్రమాలు యథావిధిగా నిర్వహిస్తామని తెలిపారు. అక్టోబరు 3 నుంచి 12వ తేదీ వరకు శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా సంబంధిత వాల్‌పోస్టర్లు, కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చే నెల 3 నుంచి ఏపీ టెట్

గుంటూరు వెస్ట్ : జిల్లాలో వచ్చే నెల 3 నుంచి 21వ తేదీ వరకు ఏపీ టెట్ నిర్వహిస్తామని డీఆర్వో పెద్ది రోజా తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఈ పరీక్షలు జరిగే ప్రాంతంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థులకు రవాణా ఇబ్బందులు తలెత్తకుండా బస్సులు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమలు చేయాలని ఆదేశించారు.

అద్దెకుంటున్న యువకులే కడతేర్చారు

- నగలు, నగదు కోసం విషమిచ్చి వృద్ధురాలి హత్య
- ఆపై పెట్రోల్ పోసి దహనం
- ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు

చీరాల: నగలు, నగదు కోసం స్థలాన్ని అద్దెకు తీసుకున్న ఇద్దరు యువకులు కిరాతకానికి పాల్పడ్డారు. 78 ఏళ్ల వృద్ధురాలిని విషమిచ్చి చంపారు. ఆపై ప్రకాశం జిల్లా దొనకొండ సమీపంలో పెట్రోల్ పోసి దహనం చేశారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనలో నిందితులు ఇద్దరిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. వివరాలను పట్టణ సీఐ ఎం.శ్రీనివాసరావు వెల్లడించారు. ఉజిలీపేటకు చెందిన జి.విజయలక్ష్మి (78) భర్త చనిపోవడంతో ఒంటరిగా నివసిస్తోంది. కూతురు అమెరికాలో, కొడుకు హైదరాబాద్‌లో స్థిరపడటంతో చాలా కాలంగానే ఒంటరిగానే ఉంటూ ఇరుగుపొరుగు వారికి అప్పులు ఇస్తుండేది. ఆమె ఈనెల 15 తేదీ నుంచి ఇంటి వద్ద కనిపించకపోవడంతో స్థానికులు కొడుకు, కూతురికి సమాచారాన్ని అందించారు. కొడుకు వెంకటరమణ ఫిర్యాదు మేరకు చీరాల వన్‌టౌన్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఆ మరుసటి రోజే దొనకొండ సమీపంలో గంగదేవపల్లి వద్ద ఓ మహిళ మృతదేహాన్ని దహనం చేసి ఉండటంతో వన్‌టౌన్ సీఐ ఆధ్వర్యంలో విచారణ ప్రారంభించారు.

స్థలం అద్దెకు తీసుకున్న వారే హత్య

మృతురాలి జి.విజయలక్ష్మి (78)కి చెందిన స్థలాన్ని అద్దెకు తీసుకుని పావరాజుతోటకు చెందిన పాశం కుమార్ తేజ, కారంచేడుకు చెందిన యార్లగడ్డ రాము గ్రానైట్ వ్యాపారం చేస్తుంటారు. కుమార్ తేజ వ్యసనాలకు బానిసై ఆర్థికంగా దెబ్బతిన్నాడు. స్థల యజమాని అయిన విజయలక్ష్మి వద్ద నగలు, నగదు ఉండటాన్ని చూసి ఆమెను చంపి వాటిని తీసుకోవాలని రాముతో కలసి ప్లాన్ చేశాడు. దాని ప్రకారం గుమస్తా రామును పంపి స్థలం కొనుగోలు చేసేందుకు కొందరు వ్యక్తులు వచ్చారని మధ్యాహ్నం రెండు గంటల సమయంలో మృతురాలిని పిలిపించారు. ముందుగా ప్లాన్ ప్రకారంలో కూల్‌డ్రింక్‌లో విషం కలిపి ఇచ్చారు. తాగిన మృతురాలి కొద్దిసేపటికే మృతి చెందింది.

బతికున్నట్లుగా సీట్లో కూర్చోబెట్టి..

ఆమె ఒంటిపై ఉన్న నగలు తీసుకుని చీరాలలోని ఓ ప్రైవేటు తాకట్టు వ్యాపారి వద్ద రూ.1.70 లక్షలు తీసుకుని కొన్ని అప్పులు తీర్చుకున్నారు. తాకట్టులో ఉన్న తన ద్విచక్రవాహనాన్ని విడిపించుకున్నాడు. అనంతరం ఆమె మృతదేహాన్ని బతికి ఉన్నట్లే చిత్రీకరించి కారులో కూర్చోబెట్టి వినుకొండ మీదుగా దొనకొండకు తీసుకెళ్లారు. దారి మధ్యలోనే పెట్రోల్ క్యాన్ కొనుగోలు చేసి దొనకొండ సమీపంలోని గంగదేవపల్లి వద్ద మృతదేహాన్ని దహనం చేశారు. త్రిపురాంతకం పోలీసు స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని మృతదేహం దహనం చేయడంపై కేసు నమోదైంది. అప్పటికే చీరాలలో మిస్సింగ్ కేసు నమోదు కావడంతో ఆ దిశగా విచారణ చేపట్టిన పోలీసులు రాము, తేజలను పలుమార్లు విచారించినా అంగీకరించలేదు. చివరకు కారంచేడు సమీపంలోని సీసీ ఫుటేజీలో తేజ కారులో విజయలక్ష్మి మృతదేహాన్ని కూర్చోబెట్టి తీసుకెళ్లడం పోలీసులు గుర్తించారు. బంగారం తాకట్టు పెట్టిన షాపులో సీసీ ఫుటేజీని సేకరించారు. సాంకేతిక సాక్ష్యాలు, పలువురుని విచారించిన అనంతరం పోలీసులు మిస్సింగ్ కేసును హత్య కేసుగా మార్చారు. నిందితుల కోసం గాలిస్తుండగా పోలీసులను చూసి కారులో పరారవుతుండగా ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి నిందితులను రిమాండ్‌కు పంపించారు. విజయలక్ష్మి కుటుంబ సభ్యులు ఆలస్యంగా ఫిర్యాదు చేయడంతో పాటు సాక్ష్యాలను పకడ్బందీగా విచారణ చేయడంతో కేసు ఆలస్యమైందని సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ అనిత, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న వన్ టౌన్ సీఐ శ్రీనివాసరావు. వెనుక ముసుగులో నిందితులు

సొంతింటి కలను నెరవేర్చుకోండి : కలెక్టర్

బాపట్ల: ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో లబ్ధిదారుల ఇల్లు నిర్మించుకుని సొంతింటి కలను నెరవేర్చుకోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. ''మన ఇల్లు – మన గౌరవం'' కార్యక్రమంలో భాగంగా శనివారం బాపట్ల పట్టణం మూలపాలెం లేఅవుట్‌లో లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గృహ నిర్మాణ పథకాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. జిల్లాలో ప్రస్తుతం 3,436 ఇళ్లు రూఫ్, లెంటిల్ స్థాయిలో ఉన్నాయని, ఈ ఏడాది డిసెంబర్ కల్లా పూర్తి చేయాలని ఆయన సూచించారు. వివిధ దశల్లో ఉన్న 18,526 ఇళ్లను మార్చి 2025 నాటికి పూర్తి చేయాలని, లేనిపక్షంలో కేంద్రం నుంచి నిధులు ఆగిపోతాయని తెలిపారు. మార్చి 2025 తరువాత యూనిట్ ధర పెంచడం గానీ, బిల్లులు చెల్లించడం గానీ కేంద్రం నుంచి నిలిచిపోతాయని వెల్లడించారు.

ఈవీఎం యంత్రాల గోదాము పరిశీలన

త్రైమాసిక పరిశీలనలో భాగంగా ఈవీఎం గోదామును జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి శనివారం పరిశీలించారు. అక్కడ విధుల్లో ఉన్న పోలీసుల్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి, సంబంధిత తనిఖీ దస్త్రంలో సంతకం చేశారు. గోదాము తలుపులను పరిశీలించారు.ఆయన వెంట జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు, ఆర్డీవో పి.గ్లోరియా, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

చట్టబద్ధంగానే భూ రిజిస్ట్రేషన్లు

బాపట్ల: నిషేధిత భూముల జాబితా 22 ఏ నుంచి 22 ఈ వరకు జరిగిన రిజిస్ట్రేషన్లు, బదలాయింపులన్నీ జిల్లాలో చట్టబద్ధంగానే సాగాయని కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. రాజధాని నుంచి సీసీఎల్‌ఏ, రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్.పి. సిసోడియా శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీక్షణ సమావేశం నిర్వహించారు. జిల్లాలో భూముల పరిస్థితిని కలెక్టర్ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. బాపట్ల జిల్లాలో నిషేధిత భూముల జాబితా నుంచి 6,363 ఎకరాలు తొలగించినట్లు తెలిపారు. ఇందులో అసైన్డ్ భూములు 818 ఎకరాలు రిజిస్ట్రేషన్ జరగ్గా, 25 ఎకరాలు చట్టబద్ధంగానే బదలాయింపులు జరిగాయని వివరించారు. చుక్కల భూమి కింద 1,089 ఎకరాలు తొలగించగా, 23 ఎకరాలు చట్టబద్ధంగానే మార్పిడి జరిగాయని చెప్పారు. 178 ఎకరాల ల్యాండ్ రికార్డ్స్ చట్ట ప్రకారమే మార్పులు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. సర్వీస్ ఇనామ్ భూములలో ఎలాంటి మార్పులు జరగలేదని ఆయన తెలిపారు.

క్లుప్తంగా

ఐదు మండలాల్లో వర్షం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు ఐదు మండలాల్లో తేలికపాటి వర్షం పడింది. గుంటూరు తూర్పులో 7.2 మిల్లీ మీటర్లు, పెదకాకాని 7, వట్టిచెరుకూరు 4.8, తాడికొండ 4.2, గుంటూరు పశ్చిమలో 0.2 మి.మీ. చొప్పున వర్షం కురిసింది.

షేర్ మార్కెట్ పేరిట రూ. 45.50 లక్షలకు టోపీ

ఆన్‌లైన్‌లో చెల్లించి మోసపోయిన వివాహిత

తెనాలి రూరల్: కేటుగాళ్లు ఓ వివాహితను రూ. 45.50 లక్షల మేర మోసం చేశారు. షేర్ మార్కెట్‌లో పెట్టుబడులంటూ నిలువునా ముంచారు. పట్టణ నందులపేటకు చెందిన నాగలక్ష్మికి ఇటీవల గుర్తు తెలియని నంబరు నుంచి వాట్సాప్ మెసేజ్ వచ్చింది. షేర్‌మార్కెట్‌లో పెట్టుబడి పెట్టడం, తద్వారా లాభాలు వస్తాయని దాని సారాంశం. లింక్‌ను క్లిక్ చేసిన నాగలక్ష్మి అందులో సూచించిన విధంగా పలు దఫాల్లో రూ. 45.50 లక్షలు ఖాతాల్లో జమ చేసింది. ఆమె పెట్టుబడికి రూ. 1.50 కోట్లు లాభం వచ్చిందంటూ మోసగాళ్లు నమ్మించారు. ఆ నగదు ఆమె ఖాతాలో జమ అవ్వాలంటే అందులో 10 శాతం ముందస్తుగా చెల్లించాల్సి ఉందని షరతు పెట్టారు. మోసపోయానని గ్రహించిన ఆమె సైబర్ పోలీసులను ఆశ్రయించారు. సైబర్ విభాగం నుంచి వచ్చిన సమాచారం మేరకు టూటౌన్ పోలీసులు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు.

అర్చక సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా వేణుగోపాల్



నగరంపాలెం: ఆంధ్రప్రదేశ్ అర్చక సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నారాయణం వేణుగోపాల్ ఎన్నికయ్యారు. గుంటూరు బ్రాడీపేటలోని రాష్ట్ర కార్యాలయంలో శనివారం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంధ్యాల వెంకట రామలింగేశ్వర శాస్త్రి అధ్యక్షత వహించారు. పూర్వ అధ్యక్షులు రొంపిచర్ల శేషాచార్యులు గతేడాది మరణించారు. అప్పటి నుంచి కార్యనిర్వాహక అధ్యక్షుడిగా వేణుగోపాల్ కొనసాగారు. ఈ క్రమంలో ఆయన్ను రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ.. సంఘం ఆశయాల సాధన కోసం అహర్నిశలు శ్రమిస్తానని అన్నారు. అర్చకుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తానని పేర్కొన్నారు, సమావేశంలో రాష్ట్ర నాయకులు బృందావనం రాధాకృష్ణమూర్తి, ఆమంచి రవికుమార్, గొట్టిపాళ్ళ కృష్ణమాచార్యులు, దీవి వెంకట శేషుబాబు, పరాశరం జగన్మోహన్, నందివెలుగు శేషగిరిరావు, పెద్దింటి ఫణి రాజేంద్రకుమార్, చెగోలం శేషాచార్యులు, పలు జిల్లాల నాయకులు యనమదల ఆంజనేయులు, చిట్యాల మల్లికార్జునశర్మ, వడ్డమాను రమణాచార్య, బృందావనం గోపీచంద్, మేడూరి శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

తూకాల్లో మోసంతో జేబుకు కత్తెర

- వ్యాపారుల మాయాజాలం
- కిలోకు 200 గ్రాములు తేడా
- ఎమ్మార్పీ కంటే అధికంగా వసూలు
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న అధికారులు



చీరాలలో ఓ షాపులలోని వస్తువులను పరిశీలిస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారి (ఫైల్)

చీరాల: పట్టణంలో ఓ వ్యక్తి చికెన్ షాపుకు వెళ్లి కిలో కొన్నాడు. తూకంలో అనుమానం వచ్చింది. మరోసారి వేయగా కిలోకు 150 గ్రాములు తేడా వచ్చింది. మరో ఘటనలో సూపర్ మార్కెట్‌లో కొనుగోలు చేసిన వస్తువులకు ఎమ్మార్పీలు లేవు. వాళ్లు చెప్పిందే రేటు అన్నట్లుగా ఉండడంతో వినియోగదారుల జేబులు చిల్లవుతున్నాయి. తోపుడు బండ్ల వారి వద్ద కాటాల సక్రమంగా ఉండడం లేదు. కిలోకు 100 గ్రాముల వరకు తేడాలు వస్తున్నాయి. తూకం రాళ్లకు బదులుగా మామూలు రాళ్లకు రబ్బర్ బ్యాండ్‌లు చుట్టి కాటాగా వినియోగిస్తున్నారు. ఇలా మరికొన్ని విషయాలు ఇటీవల తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలో బయటపడ్డాయి. జిల్లాలో బాపట్ల, చీరాల ప్రాంతాలలో తూనికలు కొలతల శాఖ కార్యాలయాలు ఉన్నాయి. చీరాల కార్యాలయం పరిధిలో మొత్తం 13 మండలాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో కిరాణా షాపులు, ఫర్టిలైజర్లు, తోపుడు బండ్ల వారు వినియోగించే తూకాలపై తనిఖీలు నిర్వహిస్తున్నారు.

150 కేసులు నమోదు

ఇటీవల చీరాల ప్రాంతంలో తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఎమ్మార్పీలు, ప్యాకింగ్ తేదీలపై క్షుణ్ణంగా పరిశీలన చేశారు. కిరాణా షాపుల్లో ముద్రించిన ధరల కన్నా అధికంగా అమ్మడం, తూకాల్లో అరిగిపోయిన రాళ్ల వినియోగించడం, ఎలక్ట్రానిక్ కాటాలలో తప్పుగా నమోదు చేయడం, నికర బరువు కన్నా తక్కువగా ప్యాకింగ్ చేయడం వంటి మోసాలు బయటపడ్డాయి. చీరాల ప్రాంతంలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు 150 కేసులు నమోదు చేశారు.

వస్తువులపై కనిపించని వివరాలు

హోల్‌సేల్ దుకాణాలలో ప్యాకింగ్ వస్తువులపై వివరాలు ఉండడం లేదు. వస్తువు ఎప్పుడు తయారు చేశారు.. ఎక్కడి నుంచి వచ్చింది.. కస్టమర్ కేర్ నంబర్ వివరాలు కనిపించడం లేదు. రెడీమేడ్ షాపుల్లో ప్యాకింగ్ దుస్తులపై ఎమ్మార్పీ లేకుండా సొంతంగా వేసి అమ్మకాలు చేస్తున్నారు. ప్యాకింగ్‌పై ఉన్న ధర కన్నా ఎక్కువగా అమ్మకాలు జరుగుతున్నాయి.

కాటాల రెన్యూవల్ ఎక్కడ ?

ఎలక్ట్రానిక్ కాటాలను ప్రతి సంవత్సరం రెన్యూవల్ చేయించుకోవాలి. అలా చేయకుండా వ్యాపారులు ఇష్టానుసారంగా వినియోగిస్తున్నారు. తూకం రాళ్లపై కూడా ముద్రలు వేయించుకోవాలి. అరిగిపోయిన రాళ్లతోనే కొందరు వ్యాపారాలు చేస్తున్నారు. ఆయిల్ షాపులలో కూడా కొలతలు సక్రమంగా ఉండడం లేదు. ఫర్టిలైజర్ షాపుల్లో యూరియా బస్తాలలో కూడా తూకంగా తేడా వస్తోంది. ఎమ్మార్పీ కంటే అధికంగా అమ్మకాలు జరుగుతున్నట్లు అధికారులు గుర్తిస్తున్నారు. వినియోగదారులు కూడా ఎవరికి ఫిర్యాదు చేయాలో సరైన అవగాహన ఉండడం లేదు. దీంతో వ్యాపారులు పలు అక్రమాలకు తెరలేపుతున్నారు

ఎక్కువ రేట్లు అమ్మితే చర్యలు

నిత్యావసర వస్తువులు, కూరగాయలు, పాలు, చికెన్ దుకాణాలు, ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తున్నాం. తూకాలు సక్రమంగా లేకుండా చర్యలు తీసుకుంటాం. ఎమ్మార్పీ కంటే ఎక్కువ అమ్మే వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం. వినియోగదారులు నష్టపోకుండా అన్ని చర్యలు తీసుకుంటాం.

–కె.నాగేశ్వరరావు, తూనికల కొలతల అధికారి, చీరాల

అవగాహనతోనే రేబిస్ వ్యాధి నివారణ

జిల్లా పశుసంవర్థక శాఖాధికారి బి. వేణుగోపాల్



బాపట్ల టౌన్: అవగాహనతోనే రేబిస్ వ్యాధిని పూర్తిస్థాయిలో నివారించగలమని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ బి. వేణుగోపాల్ తెలిపారు. ప్రపంచ రేబిస్ నిర్మూలన దినోత్సవంలో భాగంగా జిల్లా పశుసంవర్థకశాఖ కార్యాలయంలో శనివారం కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేశారు. 2030 నాటికి వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా పశుసంవర్థకశాఖ పని చేస్తున్నట్లు చెప్పారు. వీధి కుక్కల సంతతి నివారణకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయిస్తున్నామని తెలిపారు. పెంపుడు కుక్కలకు తప్పకుండా టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో బాపట్ల పశు ఏరియా వైద్యశాల ఏడీ డాక్టర్ టి. శంకరరావు, పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

సహోదయ గ్రూప్‌గా ఏర్పాటైన సీబీఎస్ఈ పాఠశాలలు



సీబీఎస్ఈ పాఠశాలల ప్రిన్సిపాల్స్‌తో సువేందు శేఖర్‌దాసు

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి పరిధిలోని సీబీఎస్ఈ పాఠశాలలు రాష్ట్రంలోనే మొట్టమొదటిగా సహోదయ గ్రూప్‌గా ఏర్పడటం మంచి పరిణామమని సీబీఎస్ఈ పాఠశాలల విజయవాడ ప్రాంతీయ అధికారి సువేందు శేఖర్‌దాసు పేర్కొన్నారు. సీబీఎస్ఈ క్లస్టర్ బాలుర షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించేందుకు గుంటూరు వచ్చిన ఆయన శనివారం లక్ష్మీపురంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య పాఠశాలలో సీబీఎస్ఈ పాఠశాలల ప్రిన్సిపాల్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు, కృష్ణా, పల్నాడు, ఎన్టీఆర్, బాపట్ల జిల్లాల నుంచి హాజరైన 30 మంది ప్రిన్సిపాల్స్‌ను ఉద్దేశించి మాట్లాడారు. అమరావతి సహోదయ స్కూల్ కాంప్లెక్స్‌గా నమోదైన సహోదయ గ్రూప్ సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు దిశా నిర్దేశం చేస్తూ ప్రగతి పథంలో పయనించాలని ఆయన ఆకాంక్షించారు. సమావేశంలో సహోదయ స్కూల్ కాంప్లెక్స్ అధ్యక్షురాలు సుధామాధవి, కార్యదర్శి లేళ్ల కృష్ణవేణి, సభ్యులు సరళ, సీతారామయ్య, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

షటిల్ విజేతలుగా కాకినాడ, హైదరాబాద్ జట్లు



విజేతలతో డీఎస్‌డీవో నరసింహారెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: సీబీఎస్ఈ క్లస్టర్ గేమ్స్–7 బాలుర షటిల్ బ్యాడ్మింటన్ విజేతలుగా కాకినాడ, హైదరాబాద్ జట్లు నిలిచాయి. ఎన్టీఆర్ స్టేడియంలో రెండు రోజుల పోటీల్లో భాగంగా బాలుర బ్యాడ్మింటన్ పోటీలు శనివారం ముగిశాయి. ఆంధ్ర, తెలంగాణాల్లోని సీబీఎస్ఈ పాఠశాలల నుంచి వచ్చిన క్రీడాకారులు పోటీపడ్డారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా క్రీడాభివృద్ధి అధికారి నరసింహారెడ్డి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మానసిక, శారీరక ఎదుగుదలకు క్రీడలు దోహదం చేస్తాయన్నారు. బాలుర షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో భాగంగా అండర్–14 విభాగంలో హైదరాబాద్‌కు చెందిన సెయింట్ ఆండ్రూస్ హైస్కూల్ ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. సూర్యా అకాడమీ గ్లోబల్ స్కూల్ ద్వితీయ స్థానంలో నిలిచింది. అండర్–17లో కాకినాడలోని శుభ నికేతన్ హైస్కూల్, హైదరాబాద్‌లోని సిల్వర్ ఓక్స్ స్కూల్ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. అండర్–19లో హైదరాబాద్ ఆల్వాల్‌లోని పల్లవి మోడల్ స్కూల్, వికాస్ మోడల్ స్కూల్, ఓబుల్ రెడ్డి మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. కార్యక్రమంలో బాలకుటీర్ కరస్పాండెంట్ రఘురాం, కేఎల్పీ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, శ్రీపాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, వివిధ సీబీఎస్ఈ పాఠశాలల ప్రిన్సిపాల్స్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐఎంఏ అధ్యక్షుడిగా డాక్టర్ సుబ్బారాయుడు

గుంటూరు మెడికల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) గుంటూరు శాఖ అధ్యక్షుడిగా గుంటూరుకు చెందిన కాక్లియర్ ఇంప్లాంట్ సర్జన్ డాక్టర్ యార్లగడ్డ సుబ్బారాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గుంటూరులోని ఐఎంఏ హాలులో సంఘ వార్షిక సర్వ సభ్య సమావేశం జరిగింది. గత ఏడాది జరిగిన నిరంతర విద్యా సంబంధిత విషయాలు, క్రియాశీలక కార్యక్రమాలపై చర్చించారు. వరదల సమయంలో సాయం అందించినందుకు రాష్ట్ర ప్రభుత్వం, అగ్నిమాపక శాఖల నుంచి ప్రశంసాపత్రాలు అందుకున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి బూసిరెడ్డి నరేంద్ర తెలిపారు. అనంతరం ఎన్నికలలో అధ్యక్షుడిగా యార్లగడ్డ సుబ్బారాయుడు, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ అమరలింగేశ్వరరావు, కార్యదర్శిగా డాక్టర్ సాయి కృష్ణ, సహాయ కార్యదర్శిగా డాక్టర్ చంద్ర రాధికారాణి , 25 సభ్యులతో కూడిన ఇతర కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి డాక్టర్ విశ్వేశ్వరరావు ప్రకటించారు. నూతన కార్యవర్గానికి సభ్యులందరూ శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ సుబ్బారాయుడు మాట్లాడుతూ.. రాబోయే కాలంలో మరిన్ని సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. తమపై విశ్వాసం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

పరిహారం నమోదులో వివక్ష



కొల్లూరు రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గాజుల్లంక వాసులు

- గాజుల్లంక గ్రామస్తులు నిరసన
- టీడీపీ నేతలు చెప్పిన వారి పేర్లు నమోదు
- విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్

కొల్లూరు : కృష్ణా నదీ వరదల వల్ల సంభవించిన నష్టం నమోదులో అర్హులకు చోటుదక్కకపోవడంపై నిరసన గళం పెల్లుబుకింది. మండలంలోని గాజుల్లంక గ్రామస్తులు శనివారం కొల్లూరు రెవెన్యూ వద్ద నిరసన తెలిపారు. తొలుత గాజుల్లంక సచివాలయం వద్ద అధికారుల్ని నిలదీశారు. తూతూమంత్రంగా నమోదు ప్రక్రియ ముగించారని మండిపడ్డారు. టీడీపీకి చెందిన నాయకులు చెప్పిన వారికే పరిహారం నమోదులో స్థానం కల్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది నుంచి సరైన సమాధానం రాకపోవడంతో మూకుమ్మడిగా కొల్లూరు రెవెన్యూ కార్యాలయానికి వెళ్లారు. గ్రామస్తుల నుంచి తహసీల్దార్ బి. వెంకటేశ్వర్లు వివరాలు తెలుసుకున్నారు. వీఆర్వో, సచివాలయ కార్యదర్శులను పిలిపించి నష్ట నమోదులో జరిగిన పొరపాట్లపై ప్రశ్నించారు. అనంతరం గ్రామస్తుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి రెండో జాబితా సిద్ధం చేయిస్తానని హామీ ఇచ్చారు.

అసైన్డ్ భూమి పేరుతో పరిహారం బొక్కేశారు

పంట పొలాల పరిహారంపై సర్వే బృందాలు పరిశీలించకుండానే నమోదు చేపట్టడంపై రైతులు తహసీల్దార్ వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. జమీందారి, ఎసైన్డ్ భూముల పేరుతో పంట నష్ట నమోదు బృందాలు పరిహార జాబితాలో చోటు కల్పించలేదని వాపోయారు. టీడీపీ నాయకులు మాత్రం నమోదు చేయించుకొని పరిహారాన్ని దిగమింగారని ఆరోపించారు. తక్షణం విచారణ చేయించి తమకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పంట నష్ట నమోదు జాబితాలపై విచారణ చేపట్టిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

మహోన్నతుడు జాషువా

డాక్టర్ కత్తి పద్మారావు



గుర్రం జాషువా చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పొన్నూరు: ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ వ్యవస్థాపకుడు, 'మన కాలపు జాషువా' పురస్కార గ్రహీత, కవి డాక్టర్ కత్తి పద్మారావు ఆధ్వర్యంలో మహాకవి గుర్రం జాషువా 129వ జయంతి ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని లుంబినీ వనం అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్‌లో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కత్తి పద్మారావు మాట్లాడుతూ.. నవయుగ కవి చక్రవర్తి జాషువా కులమత భేదాలను నిరసించిన మహోన్నతుడని కొనియాడారు. కార్యక్రమంలో మహాసభ కోశాధికారి వేము మాధవ్, గేరా ప్రసన్న కుమారి, జి. శాంతి, దాసరి శ్యామల, ఎస్. సుబ్బారావు, జొన్నలగడ్డ రాణి పాల్గొన్నారు.

జాషువా కవిత్వం యువతకు మార్గదర్శకం

ఏఎన్‌యూ: సామాజిక స్పృహ, చైతన్యం పెంచుతూ రుగ్మతలను నిర్మూలించేందుకు మార్గం చూపే జాషువా కవిత్వం యువతకు మార్గదర్శకం అని యూనివర్సిటీ పూలే అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఎం.త్రిమూర్తిరావు అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన గుర్రం జాషువా జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జాషువా రచనలను విద్యార్థులు తప్పకుండా అధ్యయనం చేయాలన్నారు. వర్సిటీ గాంధీ అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య కె. సోమశేఖర్ మాట్లాడుతూ.. తనకు ఎదురైన అవమానాలనే ఆయుధాలుగా జాషువా మలచుకున్నారన్నారు. అంబేడ్కర్ అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య వై.అశోక్ కుమార్ మాట్లాడుతూ.. జాషువా రచనలలోని సారాన్ని గ్రహించి అడుగులు వేస్తే సులువుగా లక్ష్యాన్ని సాధించగలమని పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.సురేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని వర్సిటీలలో జాషువా కళాపీఠాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆయన సాహిత్యంపై క్షేత్రస్థాయిలో అధ్యయనం జరిగేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఉద్యోగ సంఘ నాయకులు ఎన్.వెంకటేశ్వరరావు, టీఎన్‌టీయూసీ నాయకుడు కోటేశ్వరరావు, పూలే అధ్యయన కేంద్రం ప్రోగ్రామర్ బి.కోటి, పరిశోధక సంఘ నాయకులు పి.అభిషేక్, వై.రవికిరణ్, టి.రాంబాబు, డాక్టర్ రాజశేఖర్, వై.రాజేష్, ఎన్.శాస్త్రి, సునీల్, ఎంఎస్ఎఫ్ అధ్యక్షుడు ప్రఫుల్, కార్యదర్శి ఆనంద్, సలహాదారుడు నరేంద్ర, ఉద్యోగులు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

నాలుగు కిలోల గంజాయి, స్కూటీ స్వాధీనం

- నిందితుడి అరెస్ట్
- కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేశ్వరరావు, పక్కన సీఐ హైమారావు, ఎస్ఐ అశోక్

నరసరావుపేటటౌన్: అక్రమంగా గంజాయి కలిగిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి నాలుగు కిలోలతో పాటు అక్రమ రవాణాకు వినియోగించిన స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ కె.నాగేశ్వరరావు తెలిపారు. శనివారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఆయన వెల్లడించారు. చంద్రబాబునాయుడు కాలనీకి చెందిన ఉప్పుతోళ్ల తిరుపతిరావు ఇంట్లో అక్రమంగా గంజాయి కలిగి ఉన్నాడన్నా సమాచారం మేరకు శుక్రవారం రాత్రి తనిఖీలు నిర్వహించామన్నారు. అక్కడ నాలుగు కిలోల గంజాయిను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తిరుపతిరావు మినీ ట్రాన్స్‌పోర్టు వాహనానికి డ్రైవర్‌గా పనిచేస్తున్న సమయంలో తరచూ విశాఖపట్టణం వెళ్లి వస్తుండేవాడన్నారు. అక్కడ గంజాయి విక్రయించే ముఠాతో సంబంధాలు పెట్టుకొని , కొనుగోలు చేసి పట్టణంలో యువతకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు విచారణలో తేలిందని డీఎస్పీ వివరించారు. నిందితుడికి ఇద్దరు భార్యలు ఉండటంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని, సులభంగా ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చున్న ఆశతో ఈ మార్గాన్ని ఎంచుకున్నాడని చెప్పారు.

నిందితుడిపై గతంలో నరసరావుపేట వన్‌టౌన్, టూటౌన్‌లతో పాటు నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లలో కేసులు నమోదై ఉన్నాయని తెలిపారు. సమావేశంలో సీఐ హైమారావు, ఎస్ఐ అశోక్, ఏఎస్ఐ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు అండర్-19 జిల్లా స్థాయి ఎంపికలు

సత్తెనపల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్–19 బాల్ బ్యాడ్మింటన్ రైఫిల్ షూటింగ్ జిల్లా జట్ల ఎంపికలు సత్తెనపల్లి మండలం గుడిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరుగుతాయని అండర్–19 స్కూల్ గేమ్స్ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి జి.నరసింహారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 2006 జనవరి 1 తర్వాత జన్మించి ఉండాలని, ఆధార్ కార్డు, ప్రిన్సిపాల్ ధ్రువీకరణతో 10వ తరగతి మార్కుల జాబితాతో హాజరుకావాలని కోరారు.